నిమజ్జనం ఏర్పాట్లు పకడ్బందీగా చేపట్టాలి



అధికారులతో మాట్లాడుతున్న వెస్ట్ జోనల్ కమిషనర్ పి.ఉపేందర్ రెడ్డి

గచ్చిబౌలి: భక్తులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా నిమజ్జనం ఏర్పాట్లు చేయాలని శేరిలింగంపల్లి వెస్ట్ జోనల్ కమిషనర్ పి.ఉపేందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. దుర్గం చెరువు, మల్కం చెరువు, గోపీ చెరువు, గంగారం చెరువు, గుర్నాథం చెరువు, నల్లగండ్ల చెరువు, కాయిదమ్మ కుంటలను పరిశీలించారు. ప్రతి చెరువు వద్ద అవసరమైన అన్ని బృందాలను అందుబాటులో ఉంచాలని డిప్యూటీ కమిషనర్లను ఆయన ఆదేశించారు. అన్ని విభాగాలను సమన్వయం చేసుకొని ప్రశాంతంగా నిమజ్జనం ఏర్పాట్లను పూర్తి చేయాలన్నారు. కార్యక్రమంలో వెస్ట్ జోనల్ ఎస్ఈ శంకర్, ఈఈ, ఏఈలు రాంకీ ఏజెన్సీ బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవం



చందానగర్ : అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవ వేడుకలు ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం చందానగర్ డివిజన్ పరిధిలోని తపస్వి ఫౌండేషన్ అనాథ శరణాలయంలో నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా కన్వీనర్ తాడిబోయిన రామస్వామి యాదవ్ హాజరై విద్యార్థులకు స్టడీ మెటీరియల్, పండ్లు, బిస్కెట్లను పంపిణీ చేశారు. అక్షరజ్ఞానంతోనే సమాజంలో అసమానతలు తొలగుతాయన్నారు. కార్యక్రమంలో ఫ్రెండ్స్ వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు నండూరి వెంకటేశ్వరరాజు, జనార్ధన్, ఉమా చంద్రశేఖర్, జీవీ ధర్మసాగర్, జిల్ మల్లేష్, ఆశ్రమ నిర్వాహకురాలు శాంతి తదితరులు పాల్గొన్నారు.

మోదీ నాయకత్వంలోనే రామరాజ్యం

మెదక్ ఎంపీ రఘునందన్ రావు



పూజా కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ ఎం.రఘునందన్ రావు

రామచంద్రాపురం(పటాన్‌చెరు) : ప్రధాని మోదీ నాయకత్వంలోనే దేశంలో రామరాజ్య స్థాపన సాధ్యమని మెదక్ ఎంపీ ఎం.రఘునందన్ రావు అన్నారు. ఆదివారం భారతీనగర్ డివిజన్ పరిధిలోని ఎల్ఐజీ కాలనీ దత్తపీఠంలో అయోధ్య రామమందిరానికి పంపించేందుకు సిద్ధమైన బంగారు, వెండితో చేసిన ధనస్సు, బాణానికి నిర్వహించిన ప్రత్యేక పూజా కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈసందర్భంగా మాట్లాడుతూ చల్లా శ్రీనివాస శాస్త్రి 13కిలోల వెండి, కిలో బంగారంతో వీటిని తయారు చేయించడం హర్షదాయకమన్నారు. కార్యక్రమంలో నాయకులు నర్సింగ్ గౌడ్, ఎడ్ల రమేష్, అంజిబాబు, రాముగౌడ్, రాజశేఖర్ రెడ్డిలు పాల్గొన్నారు.



కాలనీ వాసులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి

వరద ముంపునకు శాశ్వత పరిష్కారం

పటాన్‌చెరు : చిట్కుల్ గ్రామ పరిధిలోని నాగార్జున, రాధమ్మ, పార్థసారధి కాలనీలలో వరద సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి తెలిపారు. శనివారం ఆయన కాలనీలలో పర్యటించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముత్తంగి పరిధిలోని జాతీయ రహదారి మీదుగా కాలనీల నుంచి బాక్స్ డ్రైనేజీ నిర్మించి వరద నీటికి శాశ్వత పరిష్కారం చూపెడతామని తెలిపారు. వచ్చే వానాకాలంలోపు పనులు పూర్తయ్యేలా చూస్తామన్నారు. మాజీ ఎంపీపీ శ్రీశైలం యాదవ్, మాజీ ఉప సర్పంచ్ విష్ణువర్ధన్ రెడ్డి, సీనియర్ నాయకులు నరేందర్ రెడ్డి, ఆంజనేయులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రతిష్ట దిగజారుతోంది



సీతారాంకు నియామక పత్రం అందజేస్తున్న మాజీ మంత్రి సబితారెడ్డి



సమావేశానికి హాజరైన కార్యకర్తలు

మణికొండ: అమలుకు సాధ్యం కాని హామీలను ఇచ్చి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ పాలనతో ప్రభుత్వం, రాష్ట్ర ప్రతిష్ట దిగజారుతోందని, తెలంగాణ అస్తిత్వాన్ని కాపాడేది, బీఆర్ఎస్ ఒక్కటేనని ప్రజలు గుర్తించారని మాజీ మంత్రి, మహేశ్వరం ఎమ్మెల్యే పి.సబితారెడ్డి అన్నారు. ఆదివారం మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ పార్టీ కార్యకర్తల సమావేశం అలకాపూర్ టౌన్‌షిప్‌లోని సెలబ్రేషన్ ఫంక్షన్ హాల్‌లో నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆమె మాట్లాడుతూ పోరాడి సాధించుకున్న రాష్ట్రాన్ని హైదరాబాద్‌తో పాటు ప్రణాళికా బద్ధంగా అభివృద్ధి చేసి దేశంలోనే మొదటి స్థానంలో నిలిపిన ఘనత బీఆర్ఎస్ ప్రభుత్వం, కేసీఆర్, కేటీఆర్, హరీష్‌రావులకు దక్కిందన్నారు. అలాంటి రాష్ట్రాన్ని ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వం తప్పుడు నిర్ణయాలతో నాశనం చేస్తుందన్నారు. హైదరాబాద్ నగరానికి ప్రపంచ వ్యాప్తంగా బ్రాండ్ ఇమేజీని సృష్టించి అనేక రంగాల్లో పెట్టుబడులు, సంస్థలను రాబట్టి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించామన్నారు. ప్రైవేటు రంగంలో 25 లక్షల ఉద్యోగాల కల్పన జరిగిందన్నారు. కేసీఆర్ రాష్ట్రాన్ని, ప్రజలను గుండెల్లో పెట్టుకుని చూసుకుంటే ప్రస్తుత ప్రభుత్వం వారిని ఎలా మోసం చేయాలని ఆలోచిస్తున్నారన్నారు. రాష్ట్రంలో సాగునీరు, తాగునీరు, మూసీ సుందరీకరణ, ఎస్టీపీల ఏర్పాటు, లింక్‌రోడ్లు, ఫ్లైఓవర్లు, అండర్‌పాస్‌లను నిర్మాణం చేసి భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టుగా అభివృద్ధి చేశామన్నారు.

◆ కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన హామీలను అమలు చేయటంలో విఫలం కావటంతో ప్రజలు వారికి బుద్ధి చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారని, రాబోయే రోజుల్లో ఏ ఎన్నికలు వచ్చినా బీఆర్ఎస్ పార్టీదే గెలుపన్నారు.

ప్రజలు వెన్నుపోటును సహించరు..

అమలుకు నోచుకోని అబద్ధపు హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం రాష్ట్ర ప్రజలకు వెన్నుపోటు పొడుస్తుందని, అదే తరహాలో ఓటు వేసి బీఆర్ఎస్‌లో గెలిపించిన స్థానిక ఎమ్మెల్యే నియోజకవర్గ ప్రజలకు వెన్నుపోటు పొడిచి పార్టీ మారారని, వారికి బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని బీఆర్ఎస్ జాతీయ అధికార ప్రతినిధి కార్తీక్‌రెడ్డి అన్నారు. టీడీపీ ఉనికిని కోల్పోవటంతో అప్పట్లో టీఆర్ఎస్‌లో చేరితే ప్రజలు సమ్మతించి మరో రెండు సార్లు ప్రకాష్‌గౌడ్‌కు ప్రజలు పట్టం కట్టారన్నారు. ఒక్కసారి అధికారం చేజారగానే పార్టీ మారటాన్ని ప్రజలు జీర్ణించుకోవడం లేదన్నారు. 30 ఏళ్ల తన తండ్రి ఇంద్రారెడ్డి, తల్లి సబితారెడ్డి ప్రాతినిధ్యం వహించిన ఉమ్మడి చేవెళ్ల నియోజకవర్గమే రాజేంద్రనగర్ అన్నారు. అర్ధరాత్రి పిలిచినా పార్టీ కార్యకర్తలకు, ప్రజలకు అందుబాటులో ఉండి సేవ చేస్తానన్నారు. నాలుగు సార్లు ఎమ్మెల్యేగా పనిచేసిన వ్యక్తి తన మార్కు అభివృద్ధిగా ఒకటి చూపాలన్నారు. ఖర్మకాలి ఉప ఎన్నిక వస్తే తమ సత్తా ఏమిటో రుచి చూపిస్తామన్నారు. రాబోయే కార్పొరేషన్ ఎన్నికల్లో అన్ని స్థానాలను గెలిచి తీరుతామన్నారు.

బీఆర్ఎస్ అధ్యక్షుడిగా సీతారాం..

మణికొండ మున్సిపాలిటీ బీఆర్ఎస్ అధ్యక్షుడిగా దూళిపాల సీతారాంను నియమించారు. నియామక పత్రాన్ని మాజీ మంత్రి సబితారెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. తన ఆధ్వర్యంలో బీఆర్ఎస్‌ను పూర్తి స్థాయిలో పటిష్టం చేసి పూర్వవైభవం తెస్తామన్నారు. కార్యక్రమంలో మణికొండ మున్సిపాలిటీ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కె. ధన్‌రాజ్, మహిళా అధ్యక్షురాలు రూపారెడ్డి, బండ్లగూడ కార్పొరేషన్ అధ్యక్షుడు నాగరాజు, వర్కింగ్ ప్రెసిడెంట్ రవీందర్‌రెడ్డి, నాయకులు లతాగౌడ్, కౌన్సిలర్ వసంతరావు, జి.నరేందర్, ఉపేంద్రనాథ్‌రెడ్డి, లక్ష్మణ్‌రావు, ఆరీఫ్, విజయలక్ష్మి, రాజేంద్రప్రసాద్‌లతో పాటు పెద్ద ఎత్తున కార్యకర్తలు పాల్గొన్నారు.




గచ్చిబౌలిలోని శివసాయిక్షేత్రంలో..



మియాపూర్ ప్రశాంత్‌నగర్‌లో..



కొండాపూర్‌లో..



నల్లగండ్లలోని అపర్ణా గ్రాండేలో..



గచ్చిబౌలిలోని హెచ్‌సీయూక్యాంపస్‌లో..



ప్రశాంత్‌నగర్‌లోని అలియన్స్ ఎలైట్స్ అపార్ట్‌మెంట్‌లో పూజలో అరెకపూడి ఎమ్మెల్యేగాంధీ



మాదాపూర్ డివిజన్ అలేఖ్య హోమ్స్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గసభ్యుడు రవికుమార్‌యాదవ్

జై బోలో గణేష్ మహరాజ్‌కీ..

- వాడవాడలా కొలువుదీరిన గణనాథులు
- ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలు
- ఆకట్టుకునేలా గణేష మండపాలు

శేరిలింగంపల్లి జోన్ బృందం: 'జై బోలో గణేష్ మహరాజ్‌కీ.....జై గణేష్....జై జై గణేష్.....' నినాదాలతో శేరిలింగంపల్లి జంట సర్కిళ్ల పరిధిలో అంతటా ఇవే నినాదాలు వినిపిస్తున్నాయి. ఉదయం నుంచి రాత్రి వరకు గణనాథులను కొలుస్తూ మైకులలో పాటల హోరు అంతటా వినిపిస్తు న్నాయి. జంట సర్కిళ్ల పరిధిలోని కొండాపూర్, గచ్చిబౌలి, శేరిలింగంపల్లి, చందానగర్, మియాపూర్, మాదాపూర్, హఫీజ్‌పేట్ డివిజన్లలోని కాలనీలు, బస్తీలలో వినాయక ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో పలు కూడళ్ళ లో గణేష మండపాలను అందంగా అలంకరించి ఏర్పాటు చేసి ఉదయం, సాయంత్రం ప్రత్యేక పూజలను నిర్వహిస్తున్నారు. అదేతరహాలో గేటెడ్ కమ్యూనిటీస్, అపార్ట్‌మెంట్లు, బస్తీలు, కాలనీలలో బాలల కమిటీల ఆధ్వర్యంలో కూడా పలు చోట్ల వినాయక విగ్రహాలను ప్రతిష్ఠించి ప్రత్యేక పూజలను చేస్తున్నారు. రాజకీయాలకు అతీతంగా నాయకులు, ప్రజాప్రతినిధులు, స్థానిక నాయకులు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. పలు ఆలయాల్లో కూడా వినాయక చవితిని పురస్కరించుకొని ప్రత్యేక పూజలను నిర్వహించారు.



ఖాజాగూడలో మాజీ కార్పొరేటర్ సాయిబాబా..



సాయిదత్తగణపతి దేవాలయంలో..



కొండాపూర్‌లో..



గాంధీ హైట్స్‌లో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



గచ్చిబౌలి శివసాయిక్షేత్రంలో..



నల్లగండ్లలోని లక్ష్మీవిహార్ ఫేజ్-2 కాలనీలో..



రాయదుర్గం బాబూజగ్జీవన్‌రామ్ యువజన సంఘం ఆధ్వర్యంలో..

డీఈ రమేష్ బదిలీ

శేరిలింగంపల్లి: జీహెచ్ఎంసీ శేరిలింగంపల్లి సర్కిల్ డీఈ రమేష్ బదిలీ అయ్యారు. లాంగ్ స్టాండింగ్‌పై ఫలక్‌నామాకు బదిలీ అయినట్లు తెలిసింది. ఇక్కడి నుంచి బదిలీపైఆయన ఫలక్‌నామా సర్కిల్‌కు బదిలీ అయినట్లు జీహెచ్ఎంసీ ఉన్నతాధికారులు ఉత్తర్వులు జారీ చేశారు. అయితే గత 5 ఏళ్లుగా ఇక్కడ పనిచేస్తున్న ఆయన మళ్లీ ఇక్కడే ఉండేందుకు ఆసక్తి కనబరుస్తూ పైరవీలు చేస్తున్నారని తెలిసింది.

ఆకట్టుకున్న భరతనాట్య ప్రదర్శన



మాదాపూర్: కళాకారులు భరతనాట్య ప్రదర్శనతో సందర్శకులను అలరించారు. మాదాపూర్‌లోని శిల్పారామంలో నిర్వహిస్తున్న వారాంతపు కార్యక్రమాలలో భాగంగా ఆదివారం ప్రవీణ వాడవల్లి శిష్యబృందం భరతనాట్య ప్రదర్శనను ప్రదర్శించి అలరించారు. ఇందులో గణేశ పంచరత్న, పుష్పాంజలి, అలరిపు, జతిస్వరం, కౌత్వం, వర్ణం, శ్లోకాలు, రాజరాజేశ్వరీ అష్టకం, నారాయణ హరి, విష మకర కన్నన్, తిల్లాన తదితర అంశాలను కళాకారులు ఆధ్య, శశి, సియా, శ్రీశాన్వి, ప్రియ, వర్షిణి, ఆశ్రిత, అహనా, ప్రకృతి, కాశ్వీ, రజని తదితరులు పాల్గొని ప్రదర్శించారు.



రాష్ట్రపతి శౌర్య పతక గ్రహీతకు సన్మానం



హెడ్ కానిస్టేబుల్‌ను సన్మానించిన ఎమ్మెల్యేలు కృష్ణారావు, గాంధీ, కార్పొరేటర్

ఆల్విన్‌కాలనీ: భగవాన్ స్వచ్ఛంద సేవా సంస్థ అధినేత భగవాన్ ఆధ్వర్యంలో వివేకానందనగర్ డివిజన్ పరిధిలోని వడ్డేపల్లి ఎన్‌క్లేవ్‌లో రాష్ట్రపతి శౌర్య పతకం సాధించిన హెడ్ కానిస్టేబుల్ చదువు యాదయ్యకు ఆదివారం సన్మాన సభ ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, అరెకపూడి గాంధీ, కార్పొరేటర్ వెంకటేశ్ గౌడ్, మాజీ కార్పొరేటర్ మాధవరం రంగారావు యాదయ్యను సన్మానించి, బహుమతులు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ భగవాన్ స్వచ్ఛంద సంస్థ అధినేత భగవాన్ సమాజహితం కోసం సేవా కార్యక్రమాలు చేయడంతో పాటు కానిస్టేబుల్ యాదయ్యను సన్మానించుకోవడం అభినందించదగ్గ విషయమన్నారు. సర్వారావు నాయుడు, ప్రసాద్, పరుస పరమేశ్వర్‌రావు, మిర్యాల రాఘవరావు, రామకృష్ణ, చందు, శ్రీనివాసరావు, ఏపీ రత్నం, పార్థసారథి, డాక్టర్ కోళ్ల వెంకటేశ్వరరావు, సీతారామయ్య, లోథా ఆనందరావు, డీవీ నాగేశ్వరరావు, వెంకటరమణ పాల్గొన్నారు.

సైబర్ ఎన్‌క్లేవ్‌లో పర్యటించిన ఎమ్మెల్యే

శేరిలింగంపల్లి: సైబర్ ఎన్‌క్లేవ్‌లో మౌళిక వసతులు కల్పించేందుకు కృషి చేస్తానని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే ఆరికెపూడి గాంధీ తెలిపారు. గచ్చిబౌలి డివిజన్ పరిధిలోని సైబర్ ఎన్‌క్లేవ్‌లో ఆదివారం పర్యటించారు. కాలనీ అసోసియేషన్ ప్రతినిధులు కాలనీలో రోడ్లు, మంచినీటి లైన్లు, వీధి దీపాలు ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యేను కోరారు. ఈ సందర్భంగా గాంధీ మాట్లాడుతూ కాలనీలో త్వరలోనే సీసీ రోడ్లు ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మంత్రిప్రగడ సత్యనారాయణ రావు, ప్రసాద్, సురేష్ నాయక్ పాల్గొన్నారు.

మాదాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం



మాదాపూర్: ప్రాణం పోసేది దేవుడైతే, ప్రాణాలను నిలబెట్టేది వైద్యులని జాతీయ బీసీదళ్ అధ్యక్షుడు దుండ్ర కుమారస్వామి తెలిపారు. మాదాపూర్‌లోని గఫూర్‌నగర్ సిగ్మా హస్పిటల్ అధ్వర్యంలో ఆదివారం ఉచిత వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రకరకాల వ్యాధులు, వైరస్‌లు ప్రభలు తున్నాయని వాటి మార్పులకు అనుగుణంగా వైద్యులు తమ సేవలను అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సిగ్మా హస్పిటల్ డైరెక్టర్ జె.శ్రీనివాస్, రామ్‌గోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.

వర్షాలకు నష్టపోయిన వారిని ఆదుకోండి



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజయ్య

పటాన్‌చెరు టౌన్: వర్షాలు, వరదల కారణంగా నష్టపోయిన ప్రజలను ఆదుకోవాలని సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు రాజయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలోని శ్రామిక భవన్‌లో ఐడీఏ పాశమైలారం సీపీఎం శాఖ మొదటి మహాసభలో ఆయన మాట్లాడుతూ... కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఒకరి పై ఒకరు విమర్శలు చేసుకోకుండా తగిన చర్యలు తీసుకొని ప్రజలకు ఉపశమనం కలిగించాలని ఆయన డిమాండ్ చేశారు. భారీ ఎడతెరిపిలేని వానలు కురియడంతో చాలా ప్రాంతాల్లో ఇళ్లు కూలిపోయాయని, పంటలు మునిగిపోయాయని ఆవేదన వ్యక్తం చేశారు. నష్టాన్ని అంచనా వేసి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిహారం అందించాలని కోరారు. నాయకులు సుధాకర్, శాంత కుమార్, శ్యాంసుందర్, రాజు, మహేష్ పాల్గొన్నారు.

నీరు నిల్వకుండా చర్యలు



నీటిని పరిశీలిస్తున్న అధికారులు

పటాన్‌చెరు టౌన్: మండలంలోని ముత్తంగి చెరువు అలుగు పారుతుండడంతో నీరంతా చిట్కుల్ గ్రామ పరిధిలోని రాధమ్మ కాలనీ, నాగార్జున, పార్థసారథి కాలనీల్లో చేరుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఆదివారం ఎంపీఓ హరిశంకర్ గౌడ్, తహసీల్దార్ రంగారావు, పంచాయతీ కార్యదర్శి కవిత కాలనీలో పర్యటించారు. అలుగు నుంచి వచ్చే వరద నీరు రోడ్లపై నిలవకుండా పనులను చేయించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ.. కాలనీలో రోడ్లపై నీరు నిల్వకుండా చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డి, కాంగ్రెస్ నేత నీలం మధు అలుగు నీరు నక్క వాగులోకి చేరేలా ఓపెన్ డ్రైనేజీ నిర్మించే విషయాన్ని పరిశీలించాలని అధికారులకు విజ్ఞప్తి చేశారని, నీటి సమస్య పరిష్కారానికి డీపీఆర్ ప్రతిపాదనలు రూపొందించి పంపితే ప్రభుత్వం నుంచి నిధులు రప్పించే బాధ్యత తాము తీసుకుంటానని భరోసా ఇచ్చారని గుర్తు చేశారు.

సత్కారం



శేరిలింగంపల్లి: తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ (టీపీసీసీ)అధ్యక్షులుగా నియమితులైన బొమ్మ మహేష్ కుమార్ గౌడ్‌కు ఆ పార్టీ శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జీ వి.జగదీశ్వర్ గౌడ్ శుభాకాంక్షలు తెలిపారు. ఆయనకు పూల బోకే అందజేసి శాలువాతో సత్కరించారు.

ఆల్‌కాలనీస్ ఫెడరేషన్ అధ్యక్షుడి రాజీనామా

మణికొండ: మున్సిపాలిటీ పరిధిలోని ఆల్‌కాలనీస్ రెసిడెన్స్ అసోసియేషన్స్ ఫెడరేషన్ అధ్యక్ష పదవికి సీతారాం రాజీనామా చేశారు. ఆయన రాజీనామా పత్రాన్ని ప్రధాన కార్యదర్శికి పంపారు. ఆదివారం సాయంత్రం హుడా కాలనీ కమ్యూనిటీ హాల్‌లో ఏర్పాటు చేసిన అత్యవసర కార్యనిర్వాహక సమావేశంలో ఆయన రాజీనామాను సభ్యులు ఆమోదించినట్లు ప్రధాన కార్యదర్శి ఆంజనేయులు తెలిపారు. ప్రస్తుతం ఉన్న ఐదుగురు ఉపాధ్యక్షుల్లో నుంచి ఒకరిని అధ్యక్షుడిగా ఎన్నుకునేందుకు ఈనెల 22న ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. మార్చి 2025తో కమిటీ కార్యవర్గం పూర్తవుతుందని, అప్పుడు పూర్తి స్థాయి ఎన్నికలు నిర్వహిస్తామన్నారు.

కోకాపేటలో రక్తదాన శిబిరం

మణికొండ: కోకాపేట ఫ్రెండ్స్ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం పంజగుట్ట నిమ్స్ ఆసుపత్రి సౌజన్యంతో రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. యువత సమాజ హితం కొరకు ఇలాంటి కార్యక్రమాలను తరచూ నిర్వహిస్తున్నట్లు సభ్యులు తెలిపారు. ఆసుపత్రులలో రక్తనిల్వలు లేక రోగులు ఇబ్బందులు పడుతున్నారనే విషయం తెలుసుకుని ఈ కార్యక్రమాన్ని నిర్వహించామన్నారు. ఈ సందర్భంగా 82 మంది యువకులు రక్తదానం చేశారు. కార్యక్రమంలో డాక్టర్లు, యూత్ సభ్యులు పాల్గొన్నారు.